## క్లుప్తంగా

### 24 నుంచి శిక్షణా తరగతులు

**కమలాపురం:** ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలపై భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ కోసమే జిల్లా స్థాయి శిక్షణా తరగతులను ఈ నెల 24వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర తెలిపారు. గురువారం కమలాపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కమలాపురం నియోజక వర్గం, వీఎన్ పల్లె మండలంలో ఈ నెల 24నుంచి మూడు రోజుల పాటు సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి శిక్షణా తరగతులను జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ ఏరియా కార్యదర్శి చంద్ర శేఖర్, ఏరియా కార్యవర్గ సభ్యులు పల్లా వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

**పులివెందుల రూరల్:** పులివెందుల పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ జగదీశ్వరరెడ్డి తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి 12 వరకు విద్యుత్ మెయింటెనెన్స్ కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. అందువల్ల పట్టణ ప్రజలు, రైతులు, వినియోగదారులు సహకరించాలన్నారు. పులివెందుల మండల పరిధి లోని 33-11కేవీ సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న కదరి రోడ్డు నల్లపురెడ్డి పల్లె , పెద్ద రంగాపురం గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని రూరల్ ఏఈ మురళీ కృష్ణ తెలిపారు.

### ఘన సన్మానం



మెప్మా సీఓ విమలను సన్మానిస్తున్న దృశ్యం

**ఎర్రగుంట్ల :** ఎర్రగుంట్ల మెప్మా సీఓ విమల ప్రొద్దుటూరుకు బదిలీ అయింది. ఈ సందర్భంగా గురువారం మెప్మా కార్యాలయంలో ఆమెకు ఘనంగా వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్పీలందరు బదిలీ అయిన సీఓ విమలను పూల మాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీఓ వసంతరెడ్డి, ఆర్పీలు పాల్గొన్నారు.

### పోలీస్ గ్రామ సభలు

**సింహాద్రిపురం:** సింహాద్రిపురం మండలంలోని ఫ్యాక్షన్ గ్రామమైన హిమకుంట్లలో గురువారం ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు ఎస్ఐ రోషన్ పోలీస్ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెల్లో గొడవలకు పాల్పడకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. ఏమైనా సమస్యలుంటే వాటిని సామరస్యంగా పరిష్కరించు కోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గొడవలకు పాల్పడితే నష్టం తప్ప ప్రయోజనం ఉండదన్నారు. పిల్లలను బాగా చదివించాలని సూచించారు.

### ఉన్నతస్థాయికి ఎదగాలి

**వేంపల్లె :** ఇడుపులపాయ పరిధిలోని వీరన్న గట్టుపల్లె గ్రామంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. గురువారం నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఆ గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ యువనేత కావలి కృష్ణతేజ తన తండ్రి కావలి విజయ్‌కుమార్ జ్ఞాపకార్థం తన సొంత నిధులతో నగదు బహుమతులు అందజేశారు. విద్యార్థులు కష్టపడి శ్రద్ధగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్, చిన్నమ్మ,, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

### నగరపాలక సంస్థలో సమావేశ మందిరం ప్రారంభం

**కడప కార్పొరేషన్:** కడప నగరపాలక సంస్థలోని మూడో అంతస్తులో రూ.39లక్షలతో ఆధునీకరించిన సమావేశ మందిరాన్ని మేయర్ సురేష్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాధునిక సదుపాయాలతో సమావేశ మందిరాన్ని తీర్చి దిద్దడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముంతాజ్‌బేగం, కార్పొరేటర్లు చెన్నయ్య, ఎం. సుబ్బారెడ్డి, మల్లికార్జున, రామలక్ష్మణ్‌రెడ్డి, కె. బాబు, సూర్యనారాయణరావు, షఫీ, అజ్మతుల్లా, బాలస్వామి రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు పత్తిరాజేశ్వరి, బండి మరియలు, డివిజన్ ఇన్‌చార్జులు ఐస్‌క్రీం రవి, శ్రీరంజన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, అలీ అక్బర్, జమాల్‌వలీ, కె. రాజశేఖర్‌రెడ్డి, బండి ప్రసాద్, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

### బాధ్యతలను కర్తవ్యదీక్షతో నిర్వహించాలి

**వైవీయూ :** విద్యార్థులు ఉంటేనే మనమందరం ఉన్నామనే విషయాన్ని గుర్తుంచుకుని ఎవరి బాధ్యతలు వారు కర్తవ్యదీక్షతో నిర్వహించాలని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ స్పష్టం చేశారు. గురువారం వైవీయూలో వసతిగృహాల సంక్షేమాధికారులు, సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఎవరెవరు ఏయే విధులు నిర్వహిస్తున్నారనే పరిచయ కార్యక్రమం అయిన తర్వాత తన ఆలోచనా విధానాలను వీసీ సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అసిస్టెంట్ డా. రెడ్డయ్య, వసతిగృహాల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

**పెండ్లిమర్రి:** పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం కొత్తగంగిరెడ్డిపల్లె గ్రామ సచివాలయం పరిధిలోని సోగాల్‌పల్లె, సోగాల్‌పల్లె హరిజనవాడ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. కొందరు పక్కాగృహాలు, రైతు భరోసా, పింఛన్ రాలేదని అడిగారు. వారికి సంక్షేమ పథకాలు ఎందుకు రాలేదని అధికారులను అడిగి తెలుసుకున్నారు. తక్షణం వారి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సోగాల్‌పల్లె హరిజనవాడలో సీసీరోడ్డు, విద్యుత్‌లైన్లు, భూసమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే స్పందించి ప్రజల సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అలాగే సోగాల్‌పల్లె గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ(ఏపీఎండీసీ) వారి సహకారంతో రూ.11లక్షల వ్యయంతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, శ్రీనువాసులు రెడ్డి, ప్రతాప్ రెడ్డి, శ్రీను, తహసీల్దార్ ఉదయభాస్కర్ రాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

**జమ్మలమడుగు:** రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలు అమలు చేస్తోం దని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం మండల పరిధిలోని పెద్దదండ్లూరు



జమ్మలమడుగు: ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



వీఎన్ పల్లె: సంగమేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మండల ఉపాధ్యక్షుడు కులాయిరెడ్డితో కలిసి నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికి తిరుగుతూ సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నుంచి నవరత్నాల పేరుతో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. ఎన్ని సమస్యలున్నా పథకాల అమలు మాత్రం ఎక్కడా వెనక్కితగ్గడం లేదన్నారు. టీడీపీ హయాంలో హామీల అమలు అటకెక్కించారన్నారు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇచ్చిన మాట ప్రకారం పాదయాత్రలో చెప్పిన హామీలతోపాటు, చెప్పని హామీలను నెరవేర్చిన ఘనత ఆయనకు మాత్రమే దక్కుతుందన్నారు. ప్రజలు ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకుని వస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. జమ్మలమడుగు చరిత్రలో ఎమ్మెల్యేలు ఏడాది పొడవునా ప్రజలకు అందుబాటులో ఉన్న దాఖలాలు లేవు. కానీ నేను ప్రతి నిత్యం ప్రజలతో మమేకమై సమస్యలను పరిష్కరిస్తున్నానన్నారు. ఈకార్యక్రమంలో గ్రామ ప్రజలు, వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

**వీరపునాయునిపల్లె:** అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. గురువారం ఆయన వీరపునాయునిపల్లె మండలం యు రాజుపాలెం సచివాలయ పరిధిలోని తంగెడుపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకోవడంతో ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, సర్పంచు సుబ్బరాయుడు, స్థానిక నాయకులు వీరభద్రారెడ్డి, శంకర్‌రెడ్డి, ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధి ఏపీఓ వెంకటసుబ్బయ్యతో పాటు పలువురు మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**సంగమేశ్వరుడిని దర్శించుకొన్న ఎమ్మెల్యే**

మండలంలోని అనిమెల సంగమేశ్వరుడిని గురువారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ చైర్మన్ శివాంజనేయరెడ్డి, అర్చకులు సుబ్రమణ్య శర్మ ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికారు. మండల కన్వీనర్ రఘునాథరెడ్డి ఆయన వెంట ఉన్నారు.

# మత్స్యకారుల ఆర్థిక ఎదుగుదలకు చేయూత

**– ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి**

**చెన్నూరు :** స్థానికంగా చేపల వినియోగాన్ని పెంచడం, తద్వారా మత్స్యకారులకు ఉపాధి కల్పన, ఆదాయం కల్పించడమే ప్రభుత్వ సంకల్పమని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మత్స్యకారుడు వర్దిబోయిన ఎరుకలయ్యకు ఆటో (త్రీ వీలర్ వాహనం) అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి పశు సంపద యోజన పథకం ద్వారా, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా సబ్సిడీతో ఫిష్ ఆంధ్ర పథకం ద్వారా మత్స్యకారులకు చేపల వ్యాపారం చేసుకునేందుకు చక్రాల వాహనాలు, మూడు చక్రాల వాహనాలు, ద్విచక్ర వాహనాలు ఇవ్వడం జరుగుతోందన్నారు. ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి అనేక పథకాలను చేపట్టడం జరిగిందన్నారు. ఫిష్ ఆంధ్ర పథకంలో 10 లక్షల రూపాయలతో (యూనిట్) చేపల దుకాణం ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. అదే విధంగా రూ. 20 లక్షల యూనిట్ ( ఫిష్ ఆంధ్ర సూపర్), రూ. 50 లక్షల యూనిట్‌తో దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చని వివరించారు. ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, వైఎస్‌ఆర్‌సీపీ మండల కన్వీనర్ జి ఎస్ భాస్కర్ రెడ్డి, ఫిషరీష్ డిప్యూటీ డైరెక్టర్ నాగలింగాచార్యులు, కడప మత్స్య అభివృద్ధి అధికారి కిరణ్ కుమార్, మద్దిలేటి, జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు నారాయణ స్వామి, గ్రామ మత్స్య సహాయకురాలు మస్తానమ్మ, అధికారులు పాల్గొన్నారు.

**చాంద్ బాషా క్లినిక్ ప్రారంభం**

చెన్నూరు పాత బస్టాండ్‌లో ఆర్ఎంపీ డాక్టర్ చాంద్ బాషా కు చెందిన నూతన క్లినిక్‌ను ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి గురువారం ప్రారంభించారు. అనంతరం మైనార్టీకి చెందిన అల్లా బకాష్ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పార్టీలో చేరారు.



మత్స్యకారునికి ఆటో డాక్యుమెంట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

# వైభవంగా శ్రీకాశీవిశ్వేశ్వర విగ్రహ ప్రతిష్ట

**ముద్దనూరు:** మండలంలోని కొర్రపాడు పునరావాస కాలనీలో గురువారం పలు దేవతా విగ్రహాల ప్రతిష్టా కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. శ్రీకాశీ విశ్వేశ్వర విగ్రహ ప్రతిష్ట ఉత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. నూతన విగ్రహ ప్రతిష్ట సందర్భంగా కొర్రపాడులో బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మునిరాజారెడ్డిలు బండలాగుడు పోటీలను ప్రారంభించారు. పోటీలు ఉత్సాహ భరితంగా సాగాయి. సాయంత్రం విజేతలైన ఎద్దుల యజమానులకు నగదు బహుమతులను పంపిణీ చేశారు.



నూతనంగా ప్రతిష్ఠించిన శ్రీకాశీ విశ్వేశ్వరుని విగ్రహం



కొర్రపాడులో బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

### యువతకు ఉపాధి అవకాశాలు



మాట్లాడుతున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

**పులివెందుల రూరల్:** యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని మున్సిపల్ ఇన్‌చార్జ్ వైఎస్ మనోహరరెడ్డి అన్నారు. గురువారం మున్సిపాలిటీ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో ఆదిత్యా బిర్లా గార్మెంట్స్‌లో మహిళా టైలర్స్ కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలకు 200 మంది హాజరయ్యారు. వారిలో 110 మందికి ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. గార్మెంట్స్‌లో పని చేసేవారికి ఈపీఎఫ్, ఈఎస్ ఐ సౌకర్యాలుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాదు, కమిషనర్ నరసింహారెడ్డి, కౌన్సిలర్ కిషోర్, మెప్మా అధికారులు గంగులయ్య, నాయుడు, నాగన్న, ఏరియా కోఆర్డినేటర్ నీలకంఠారెడ్డి పాల్గొన్నారు.

# ఓర్వలేకే తప్పుడు ఆరోపణలు

**చెన్నూరు :** అభివృద్ధిని చూసి ఓర్వలేకే టీడీపీ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్‌వీఎస్‌ఆర్ మండిపడ్డారు. గురువారం ఆయన తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. కరోనా కష్ట కాలంలో ఏ తెలుగుదేశం నాయకుడు కూడా ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించకుండా కేవలం తమ ఇళ్లకే పరిమితమయ్యారన్నారు. ఆ సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల పక్షాన నిలబడి సంక్షేమ పథకాలు అందజేసి , సమస్యలు లేకుండా పాలన చేశారని గుర్తుచేశారు. నారా లోకేష్ యువగళం పాదయాత్రలో భాగంగా చెన్నూరు బహిరంగ సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డిపై అవగాహన లేని, పరిజ్ఞానం లేని అవాస్తవాలు మాట్లాడడం సరికాదన్నారు. రాజకీయ అవగాహన లేకుండా ఎవరో రాసిచ్చిన స్క్రిప్టును చదవడం తప్ప, ఆయన పాదయాత్రలో రైతుల సమస్యలు గానీ, ప్రజల సమస్యలు గానీ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిద్ది గారి వెంకటసుబ్బయ్య, మండల కో ఆప్షన్ మెంబర్ వారిష్, అబ్దుల్ రబ్, నిరంజన్ రెడ్డి, సొంట్టం నారాయణరెడ్డి, సాదు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి నిర్మాణాలలో వేగం పెంచాలి

**జమ్మలమడుగు రూరల్ (మైలవరం):** లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని మైలవరం మండల ఎంపీడీఓ వై. రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం మైలవరం మండల పరిధిలోని వద్దిరాల గ్రామంలోని సచివాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు సమస్యల గురించి అధికారులకు అర్జీలు అందజేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి గురువారం సచివాలయ పరిధిలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్జీలకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జయశ్రీ, తహశీల్దార్ తిరుపతయ్య, సచివాలయ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంపలాకు రామాంజనేయ యాదవ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఎర్రగుంట్ల మెప్మా టీఎంసీగా నాగేంద్ర

**ఎర్రగుంట్ల :** ఎర్రగుంట్ల మున్సిపల్ పరిధిలో ఉన్న మెప్మా సంస్థ టీఎంసీగా నాగేంద్రను నియమించారు. గురువారం మెప్మా టీఎంసీగా ఆయన బాధ్యతలు చేపట్టారు. నాగేంద్ర ప్రస్తుతం కమలాపురం మెప్మా టీఎంసీగా కూడా పనిచేస్తున్నాడు. అయితే జిల్లా ఉన్నతాధికారులు ఎర్రగుంట్ల టీఎంసీగా కూడా అదనపు బాధ్యతలు అప్పగించారు.

# వీఆర్‌ఏల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి

**వీరపునాయునిపల్లె:** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధులుగా పనిచేస్తున్న వీఆర్‌ఏల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని ఆంధ్రప్రదేశ్ వీఆర్‌ఏల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కొమ్మద్ది ఈశ్వరయ్య అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో గ్రామ రెవెన్యూ సహాయకులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై క్యాబినెట్ సమావేశంలో చర్చించక పోవడం బాధాకరమన్నారు. తక్షణమే వీఆర్‌ఏల న్యాయపరమైన సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని కోరారు. లేకపోతే దశలవారీగా ఉద్యమాలు చేస్తామన్నారు.

# సమగ్ర శిశు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**వేంపల్లె :** వేంపల్లె మండలంలోని నూతన ఐసీడీఎస్ కార్యాలయాన్ని పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. సీడీపీఓ సునీత ఆధ్వర్యంలో స్థానిక బాలికల బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఈ భవనాన్ని ఆయనతోపాటు జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబులరెడ్డి, ఎంపీపీ లక్ష్మిగాయత్రిలు కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిశుసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. వేంపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో వేంపల్లె, చక్రాయపేట, వేముల మండలాలకు సంబంధించి ఐసీడీఎస్ కార్యాలయం అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. చిన్నపిల్లలకు, గర్భవతులకు, బాలింతలకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవచూపుతోందన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వ సేవలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పులివెందుల సీడీపీఓ శ్రీలత, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



సీడీపీఓ కార్యలయాన్ని ప్రారంభిస్తున్న ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి

### చిత్రలేఖనం పోటీలు

**పులివెందుల టౌన్ :** స్థానిక పులివెందుల శాఖా గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్‌లో భాగంగా గురువారం విద్యార్థులకు పుస్తకపఠనం, కథలు చెప్పడం , చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. గ్రంథాలయ అధికారి కృష్ణకిషోర్ విద్యార్థులకు పంచతంత్ర కథలు చదివి వినిపించారు. విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సైదాపురం పుస్తక నిక్షిప్త కేంద్రం నిర్వాహకులు ప్రతాప్‌రెడ్డి, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ముమ్మరంగా రోడ్ల విస్తరణ పనులు



జేసీబీ సాయంతో విస్తరణ పనులలో భాగంగా నిర్మాణాలను తొలగిస్తున్న వైనం

**పులివెందుల టౌన్:** పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా పట్టణంలోని రోడ్ల విస్తరణ పనులు వేగవంతమయ్యాయి. రోడ్ల విస్తరణలో పట్టణంలోని కడపరోడ్డు, అంబకపల్లెరోడ్డు ప్రాంతాలలో రోడ్డు ఇరువైపులా విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇళ్లను, దుకాణాలను విస్తరణలో తొలగించుకోవాలని అధికారులు ఆదేశించడంతో వాటిని తొలగించే పనుల్లో స్థానిక ప్రజలు నిమగ్నమయ్యారు.

### నేత్రదానం చేసిన కుటుంబానికి ప్రశంసాపత్రం



నేత్రదానం చేసిన కుటుంబానికి ప్రశంసా పత్రం అందజేస్తున్న డాక్టర్ తదితరులు

**పులివెందుల టౌన్ :** మే 23న మృతి చెందిన గోపనపల్లె రెడ్డమ్మ కార్నియాలను కుటుంబ సభ్యులు దానం చేసేందుకు అంగీకారం తెలిపిన విషయం తెలిసిందే. అయితే ఆమె కుటుంబ సభ్యులకు గురువారం స్థానిక వేంకటరమణుడి ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ప్రముఖ చిన్న పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ రవీంద్రనాథరెడ్డి, సేవాసమితి అధ్యక్షుడు రాజుల చేతులమీదుగా ప్రశంసా పత్రాన్ని అందజేసి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఎంతోమంది చూపు కోల్పోయి అంధత్వంతో బాధపడుతుంటారన్నారు. ఈ కార్యక్రమంలో నేత్రనిధి టెక్నీషియన్ హరీష్, తదితరులు పాల్గొన్నారు.

### తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడండి

**సింహాద్రిపురం:** మండలంలో ఏగ్రామంలో కూడా తాగు నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఎంపీపీ అరుణ అన్నారు. గురువారం మండల సభాభవనంలో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వైఎస్సార్ బీమా, ఈకేవైసీ గ్రామాలలో వలంటీర్లతో పూర్తి చేయించుకోవాలన్నారు. ఏఒక్క కుటుంబం నష్ట పోకుండా చూడాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులపై ఉందన్నారు.

– నియోజకవర్గంలోని 2021-23 సంవత్సరం వరకు అరటి, మామిడి నష్ట పోయిన రైతులకు నష్ట పరిహారం ప్రభుత్వం అందిస్తుందని హెచ్‌ఓ మల్లికార్జునరెడ్డి తెలిపారు. అరటి, మామిడి నష్ట పోయిన రైతులు తమ పట్టా పాస్ బుక్, బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డు జిరాక్స్ సంబంధిత రైతు భరోసా కేంద్రాలలో ఇవ్వాలన్నారు. అలాగే కొత్తగా 2500 ఎకరాలకు డ్రిప్ మంజూరైందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ కృష్ణమూర్తి, డీటీ వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రోడ్లపై వర్షపు నీరు లేకుండా చూడాలి



బస్టాండ్ వద్ద పరిశీలిస్తున్న ఓఎస్డీ అనిల్‌కుమార్ రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి

**పులివెందుల రూరల్:** పట్టణంలోని ముద్దనూరు రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్, ఆంజనేయ స్వామి ఆలయ పరిసర ప్రాంతాలలో వర్షపు నీరు రోడ్లపై ఉండటంతో ఆప్రాంత వాసులు గురువారం పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జ్ వైఎస్ మనోహరరెడ్డి, చైర్మన్ వరప్రసాదు దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వారు రోడ్లపై నీరు నిలువ ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. ఆంజనేయ స్వామి ఆలయం లోతట్టు కావడంతో ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రధాన రహదారిలో వచ్చిన నీరు ఆలయంలోకి వస్తున్నాయన్నారు. వర్షపు నీరు ఆలయంలోకి రాకుండా డ్రైనేజీలోకి వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

### పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**జమ్మలమడుగు రూరల్ (మైలవరం):** ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి పి. మనోరమ పేర్కొన్నారు. గురువారం మైలవరం మండల పరిధిలోని కొనఅనంతపురం గ్రామాన్ని సందర్శించి దోమ కాటు వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు సూచనలు అందజేశారు. అనంతరం సిబ్బందితో కలసి గ్రామంలో దోమల నివారణకు మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా మనోరమ మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిలబడకుండా జాగ్రత్తలు పాటించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి వెంకటరెడ్డి, జమ్మలమడుగు యూనిట్ అధికారి సుబ్బరాజు, రామమోహన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ప్యాసింజర్ రైళ్లు ఆపాలి

**కొండాపురం:** ధర్మవరం ఎక్స్‌ప్రెస్, అమరావతికి వెళ్లే రైళ్లు రెండు రోజుల నుండి ఆపలేదని కొండాపురం రైల్వేస్టేషన్‌లో ఆపాలని ప్రజాసంఘాలు, సీపీఐ మండల కార్యదర్శి ఎం. మనోహర్‌బాబు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక రైల్వేస్టేషన్‌లో స్టేషన్ మాస్టర్ ప్రసాదు వీరాకు ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ రైళ్లు ఆపకపోతే పెద్ద ఎత్తున ధర్నా చేపడతామన్నారు.

### విత్తనాలు పంపిణీ



రైతులకు విత్తన కాయలు పంపిణీ చేస్తున్న మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ సర్వోత్తమ రెడ్డి

**పులివెందుల రూరల్:** రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని మార్కెట్ యార్డు చైర్మన్ సర్వోత్తమరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని ఉలిమెల్ల, ఎర్రిపల్లె గ్రామాలలోని రైతు భరోసా కేంద్రాలలో రైతులకు వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేశారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు కావాల్సిన వాటిని ప్రభుత్వం అందిస్తోందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నాగలక్ష్మి, సర్పంచు మల్లేశ్వర రెడ్డి, సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

**లింగాల:** లింగాల మండల కేంద్రంలో రైతు భరోసా కేంద్రాల వద్ద గురువారం రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలను లింగాల గ్రామ సర్పంచు జుబాకర్, వ్యవసాయ అధికారి రమేష్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్‌కు సంబంధించి మండలానికి 500 క్వింటాళ్లు విత్తన కాయలు మంజూరు అయ్యాయన్నారు. రైతు భరోసా కేంద్రాలలో ఇప్పటి వరకు 485 క్వింటాళ్లకు రైతులు నమోదు చేసుకున్నారన్నారు.